# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. • సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్


Dr. RAHUL KUMAR 9989834020

K. Naveen Kumar 94406 53413



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 73 | పేజీలు : 08 | శనివారం | 21-03-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

2

## ముదురుతున్న ఎండలు

**పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పెరుగుతున్న ఎండల తీవ్రత**

**40 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

**పలు జిల్లాల్లో జల్లులు కూడా కురవొచ్చన్న వాతావరణ శాఖ**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురవడంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల నుంచి కాస్త ఉపశమనం లభించినా, మళ్లీ రెండు రోజుల నుంచి భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండతో పాటు ఉక్కపోత కూడా పోస్తోంది. ఎండల



2

## వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు


**అంగరంగవైభవంగా జానకీరాముల కల్యాణం**

**కుటుంబసభ్యులతో కలిసి కల్యాణంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు**

**భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన సీఎం**

హైదరాబాద్ పల్స్,భద్రాద్రి

భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సీతా సమేత శ్రీరామచంద్రుడి కల్యాణాన్ని మిథిలా మైదానంలో అభిజిత్ లగ్నంలో అట్టహాసంగా నిర్వహించారు. సీతమ్మ తల్లిని శ్రీరాముడు మనువాడే అద్భుత ఘడియల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న రామభక్తులు ఈ లోకకల్యాణాన్ని కనులారా తిలకించి



ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు

## ప్రకటించనున్న కవిత

2

**కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన కవిత**

**ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావ సభకు ముహూర్తం ఖరారు**

**ఈ సభ వేదికగా పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ**

**తెలంగాణ ఆడబిడ్డగా పార్టీ పెడుతున్నానని వెల్లడి**

**యువత, మహిళలకు తమ పార్టీలో పెద్దపీట వేస్తామని హామీ**



## రాజకీయాలకు బ్రేక్..

ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు

2

**తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీల నిర్వహణ**

**ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో స్పోర్ట్స్ మీట్**

**రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రజాప్రతినిధులకు ఇలాంటి పోటీలు ఇదే ప్రథమం**

**ప్రతినిధుల మధ్య స్నేహబంధం పెంచి, క్రీడా స్ఫూర్తి నింపడమే లక్ష్యం**

కఠిన సమయాల్లోనే నాయకత్వ

## పటిమ తెలుస్తుంది

ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు



2

**పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు**

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు**

**ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం**

**సామాన్యుడికి మేలు చేసే నిర్ణయమన్న ముఖ్యమంత్రి**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన చంద్రబాబు**

ఇరాన్‌పై దాడులు

## తీవ్రతరం చేస్తాం


ఇజ్రాయెల్ మంత్రి హెచ్చరిక

**పౌర ప్రాంతాలపై దాడులు వద్దని కోరుతున్నామన్న కాట్జ్**

**ఇరాన్ మాత్రం దాడులు ఆపడం లేదని ఆగ్రహం**

**అందుకే దాడులు తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరిక**

2





2

## బస్సు యజమాని అరెస్ట్

మార్కాపురం బస్సు ప్రమాదం కేసు...

**బస్సు ప్రమాదంలో 14 మంది మృతి**

**డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక నిర్ధారణ**

**ప్రస్తుతం డ్రైవర్, యజమానిని విచారిస్తున్న పోలీసులు**

## సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలని దిశానిర్దేశం 2

**పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతోప్రధాని మోదీ సమీక్ష**

**ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ**

**ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం**

**చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు**

హైదరాబాద్ పల్స్,డెస్క్

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్



## జాబితాలో రేవంత్ రెడ్డి

**గోవాలోని పోండా ఉపఎన్నికల క్యాంపెయినర్ల జాబితాలోనూ ముఖ్యమంత్రి పేరు**

2



**పుదుచ్చేరి ఎన్నికల జాబితాలో తెలంగాణ మంత్రుల పేర్లు**

**కేరళ, అసోం, పుదుచ్చేరిలకు 40 మంది చొప్పున స్టార్ క్యాంపెయినర్ల ప్రకటన**

## దాడుల్లో ఇరాన్‌లో 1,900 మంది మృతి

**సుమారు 20,000 మందికి గాయాలు**

**వెల్లడించిన ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ**

**ఇరాన్ ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది మృతి**

2



## తీన్మార్ మల్లన్న కీలక నిర్ణయం..

పాదయాత్ర చేపడుతున్నట్లు ప్రకటన

**జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లన్న పాదయాత్ర**

**బీసీలకు రాజకీయ అధికారం దక్కాలనేదే ప్రధాన అజెండా**

**పాదయాత్రలో బీసీల సమస్యలను తెలుసుకోనున్న తీన్మార్ మల్లన్న**

2



# ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు ప్రకటించనున్న కవిత

మొదటి పేజీరువాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25వ తేదీన తన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు. తాను సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ఇప్పటికే ఆమె పలు సందర్భాల్లో వెల్లడించడం తెలిసిందే. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు కవిత పేర్కొన్నారు. ఈ వేదికపై పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించనున్నట్లు ఆమె వివరించారు. నేడు శ్రీరామనవమి పర్వదినం కావడంతో, పార్టీకి సంబంధించిన కీలక అప్ డేట్ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత స్పందిస్తూ, "ఇప్పటివరకు మగవాళ్లు పెట్టిన పార్టీలనే చూశారు. ఇప్పుడు ఓ తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారు" అని అన్నారు. తమ పార్టీలో యువత, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తెలంగాణ జాగృతి ద్వారా ఇప్పటికే ప్రజల్లో ఉన్న కవిత, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి సొంత పార్టీతో అడుగుపెట్టనుండటం ఆసక్తి రేపుతోంది. పార్టీ విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణపై ఏప్రిల్ 25న పూర్తి స్పష్టత రానుంది.

# రాజకీయాలకు బ్రేక్..

మొదటి పేజీరువాయి

నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు**

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.

# బస్సు యజమాని అరెస్ట్

మొదటి పేజీరువాయి

ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను కలచివేసింది. 14 మంది ప్రాణాలను బలిగొన్న ఈ విషాద ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలడంతో, బస్సు డ్రైవర్ యువరాజుతో పాటు యజమాని హరికృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రైవర్‌ను ప్రధాన నిందితుడిగా చేరుస్తూ సెక్షన్ 304ఏ కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. విచారణ ముగిసిన అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు వీరికి రిమాండ్ విధించే అవకాశం ఉంది. టిప్పర్ లారీని ఢీకొట్టిన ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనం కాగా, చికిత్స పొందుతూ ఒక బాలుడు మరణించాడు.

# తీన్మార్ మల్లన్న కీలక నిర్ణయం..

మొదటి పేజీరువాయి

తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కీలక ప్రకటన చేశారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్ర చేపడుతున్నట్టు ప్రకటించారు. తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (౧=ా) ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేవలం ఒక నిరసనగా కాకుండా, బీసీలకు, వెనుకబడిన తరగతులకు రాజకీయ అధికారం దక్కాలనే ప్రధాన అజెండాతో ఈ యాత్ర సాగనుంది. గ్రామగ్రామాన పర్యటించి బీసీల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతను కూడగట్టడమే లక్ష్యంగా పాదయాత్ర కొనసాగనుంది. జూన్ 2న ప్రారంభం కానున్న ఈ సుదీర్ఘ పాదయాత్రకు సంబంధించి ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైంది. ఏ జిల్లా నుంచి యాత్ర మొదలవుతుంది, ఏయే దశల్లో ఎన్ని కిలోమీటర్లు సాగుతుంది అనే పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.

# దాడుల్లో ఇరాన్‌లో 1,900 మంది మృతి

మొదటి పేజీరువాయి

అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 1,900 మందికి పైగా మరణించారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత నెల ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 20,000 మంది గాయపడ్డారని తెలుస్తోంది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1,100 మందికి పైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది.

# సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

మొదటి పేజీరువాయి

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# ముదురుతున్న ఎండలు

మొదటి పేజీరువాయి

తీవ్రతపై హైదరాబాద్ లోని భారత వాతావరణ కేంద్రం (ఐఎమ్‌డీ) పలు జిల్లాల్లో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసింది. ప్రధానంగా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే, కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో పాటు తేలిక పాటి వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలియజేశారు.

ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

రెండు, మూడు రోజుల నుంచి భానుడి ప్రతాపంతో రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ప్రధానంగా ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, దీంతో ఆయా ప్రాంతాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో 36 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనూ

శనివారం నుంచి ఉత్తర తెలంగాణతో పాటు దక్షిణ తెలంగాణలోనూ క్రమంగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎండలు దంచికొట్టే వీలుందని హెచ్చరించారు. దీంతో వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి జిల్లాల్లో కూడా 41 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని, ఈ ప్రాంతాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

అప్రమత్తంగా ఉండాలి

ఈ నెల 28 నుంచి రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని దీంతో ఉక్కపోతతో అసౌకర్యమైన వాతావరణం ఏర్పడుతుందని ఐఎమ్‌డీ అధికారులు తెలియజేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలతో భూ ఉపరితలం వేడెక్కడంతో గాలి తేలికపడి సుడిగాలులు వీయడం, దట్టమైన మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశముందని చెబుతున్నారు. పిడుగు అనేది మేఘాలు ఒకదానిని ఒకటి ఢీ కొన్నప్పుడు పుట్టే అధిక విద్యుత్ శక్తి అని, ఎత్తైన చెట్లు, విద్యుత్ స్తంభాలు పిడుగును ఆకర్షించే అవకాశముందని వివరించారు. అందుకే ఈ సమయంలో ప్రజలు ఎత్తైన ప్రదేశాల్లో, చెట్ల కింద, కరెంట్ పోల్స్ దగ్గర ఉంటే పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. ఈ సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## కఠిన సమయాల్లోనే నాయకత్వ

# పటిమ తెలుస్తుంది

మొదటి పేజీరువాయి

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్ చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "కఠినమైన, సవాలుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటపడుతుంది. నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం. ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరపున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది. నేడు అనేక దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

# జాబితాలో రేవంత్ రెడ్డి

మొదటి పేజీరువాయి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ, కేరళ, అసోం, పుదుచ్చేరిలలో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. గోవాలోని పోండా ఉప ఎన్నిక క్యాంపెయినర్ల జాబితాలోనూ ఆయన పేరు ప్రకటించారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో చేర్చారు. కేరళ, అసోం, పుదుచ్చేరిలకు 40 మంది చొప్పున స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్లుభట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల పేర్లు ఉన్నాయి. స్టార్ క్యాంపెయినర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు.

# ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

మొదటి పేజీరువాయి

ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ తెలిపారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, గల్ఫ్, ఇజ్రాయెల్ దేశాల్లో పౌర ప్రాంతాలపై క్షిపణి దాడులు చేయవద్దని తాను, ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ ఇరాన్‌ను హెచ్చరించినట్లు తెలిపారు. కానీ ఇరాన్ మాత్రం పౌర ప్రాంతాలపై దాడులు ఆపడం లేదని మండిపడ్డారు. పదేపదే హెచ్చరించినప్పటికీ ఇరాన్ దాడులు ఆపడం లేదని, ఈ నేపథ్యంలో ఆ దేశంపై దాడులను తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరించారు. ఇరాన్‌లోని మరిన్ని ప్రాంతాలు లక్ష్యంగా దాడులు చేస్తామని పేర్కొన్నారు. ఈ యుద్ధ నేరానికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వ్యాఖ్యానించారు.

**క్షిపణి తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం**

టెహ్రాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఈరోజు తెలిపింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలోని క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్లు వెల్లడించింది. కాగా, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలవుతోంది. ఈ కాలంలో ఇరాన్‌పై 850కి పైగా తోమహక్ క్షిపణులను అమెరికా ప్రయోగించింది.

# భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

మొదటి పేజీరువాయి

తరించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో మాంగళ్యధారణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గీత దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

**రూ.351 కోట్లతో భూమిపూజ**

ఈ కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధికి తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు.

ప్రతి ఘట్టం ఆధ్యాత్మిక సాగరమే

జగాలను ఏలిన జగదేకవీరుడికి జగన్మాత సీతమ్మకు అభిజిత్ లగ్నంలో జరిగిన కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. ఈ వైభవాన్ని కనులారా తిలకించి లోకమంతా పులకించిపోయింది. భద్రాచలం దివ్యక్షేత్రంలో భక్త కోటిని నయనానందకరం చేసింది. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు సాగిన కల్యాణ క్రతువులో ప్రతీ ఘట్టం ఆధ్యాత్మిక రస సాగరంలో ముంచెత్తింది. ప్రత్యేకంగా అలంకరించిన మిథిలా ప్రాంగణంలో తొలుత తిరు కల్యాణానికి సంకల్పం పలికి, సర్వ విఘ్నాన శాంతికి ఆరాధన చేపట్టారు.

**వేద మంత్రోచ్చారణలు**

కల్యాణానికి ఉపయోగించే సామగ్రిని సంప్రోక్షణ చేసిన తర్వాత రక్షా బంధనం నిర్వహించి యోకర్తధారణ చేశారు. ఇరు వంశాల గోత్రాలు పఠించి స్వామివారి పాద ప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. వేద మంత్రోచ్చారణలు మార్మోగుతుండగా అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచారు. ఈ సమయాన్ని శుభ ముహూర్తమని జగత్ కల్యాణ శుభ సన్నివేశంగా కీర్తిస్తారు. రాముడి దోసిట తలంబ్రాలు నీలపు రాసులవుతుంటే జానకి దోసిట తలంబ్రాలు కెంపులయ్యాయి.

నేడు శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం

తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భద్రాచలం వచ్చిన భక్త జనానికి ఎలాంటి అసౌర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా సెక్టార్లు ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా చలువ పందిళ్లు వేశారు. భక్తుల తాకిడి పెరుగుతుండటం, ప్రముఖుల రాక ఎక్కువ ఉండటంతో దాదాపు 2 వేల మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాల్లో చివరి ఘట్టమైన శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం నేడు జరగనుంది.

**గోటి తలంబ్రాల అందజేత**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం అనంతరం ప్రముఖులకు వేద పండితులు స్వామివారి గోటి తలంబ్రాలు అందజేశారు.

# కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ మహోత్సవం





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు, ఉప ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవస్థాన అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనంతరం మిధుల స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఉప ముఖ్యమంత్రి , మంత్రులు, భక్తులతో కలిసి స్వామి వారి దివ్య కళ్యాణాన్ని వీక్షించనున్నారు.ఈ సందర్భంగా సుమారు రూ.351 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న భద్రాద్రి దేవస్థానం సమగ్ర పునర్ అభివృద్ధి పనులకు, అలాగే గోదావరి నది తీరంలో ఆధునిక సదుపాయాలతో ఘాట్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ పనుల ద్వారా యాత్రికులకు మెరుగైన వసతులు, భద్రతా ఏర్పాట్లు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది.దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యే సరికి భద్రాద్రి క్షేత్రం మరింత వైభవంగా తీర్చిదిద్దబడుతుందని, దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, దేవస్థాన ఈఓ, సిబ్బంది మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అక్రమంగా భారీ కంటైనర్లలో ఆవులను తరలిస్తున్న కంటైనర్లు పట్టివేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, షాద్ నగర్:**
అక్రమంగా భారీ కంటైనర్లలో ఆవులను తరలిస్తున్న రెండు కంటైనర్‌లను హిందూ వాహిని, భజరంగ్దళ్ సభ్యులు గురువారం రాత్రి పట్టుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా పట్టణ ముఖ్య కూడలిలో తోరణాలను కడుతున్న హిందు వాహిని సభ్యులకు మూడు కంటైనర్లు అనుమానాస్పదంగా కనిపించాయి. కంటైనర్ డ్రైవర్లను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా కంటైనర్లను ఆపకుండా డ్రైవర్లు అతివేగంగా తీసుకెళ్లారు. కంటైనర్లను వెంబడించిన హిందూ వాహిని, భజరంగ్దళ్ సభ్యులు తమ ద్విచక్ర వాహనాలతో వెంబడించి రెండు కంటైనర్‌లను పట్టుకోగా, ఒక కంటైనర్ వెళ్లిపోయింది.పట్టుకున్న రెండు కంటైనర్‌లోని 48 ఆవులను షాద్ నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మ గుట్ట గోశాలకు తరలించారు. ఆవులు తరలిస్తున్న కంటైనర్‌లను హిందూ వాహిని సభ్యులు పట్టుకున్నారన్న విషయం తెలుసుకున్న ఫరూఖ్ నగర్ కు చెందిన మరో వర్గం భారీగా గోశాల వద్దకు చేరడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి తోపులాటలకు పాల్పడడంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

# ఇస్నాపూర్ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా

## గడ్డం శ్రీశైలం, బాలమని దంపతుల ఆధ్వర్యంలో





**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27 :**
ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం మందిర ప్రాంగణంలో గడ్డం శ్రీశైలం బాలమణి గార్ల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.పవిత్ర వాతావరణంలో ఘన కల్యాణంఈ పవిత్ర కార్యక్రమం భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించబడగా, దేవాలయ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి పోయింది. ప్రత్యేక పూజలు, మంగళ వాద్యాల నాదాలు, వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం అత్యంత ఘనంగా జరిగింది. చైర్పర్సన్ సహా భారీ హాజరుఈ కల్యాణ మహోత్సవానికి ఇస్నాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరూ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఐక్యత, సాంప్రదాయాలు బలపడ్డాయిఈ వేడుక భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు గ్రామంలో ఐక్యతను, సాంప్రదాయ విలువలను మరింత బలపరిచింది.



# సరిహద్దుల వద్ద భద్రత కట్టుదిట్టం: ప్రధాని మోదీ కీలక ఆదేశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, ఢిల్లీ :**
పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ దేశ భద్రతపై కీలక ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దులు, తీర ప్రాంతాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ప్రధాని నరేంద్ర మోదీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించి, దేశ భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సంక్షోభ పరిస్థితులను ఆసరా చేసుకుని భద్రతకు విఘాతం కలిగించే శక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన ముఖ్యమంత్రులకు సూచించారు.దేశ సరిహద్దులు, తీర ప్రాంతాలలో నిఘాను పెంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ప్రధాని ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడాలని ఆయన తెలిపారు.తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులపై కూడా కఠినంగా వ్యవహరించాలని ప్రధాని నొక్కి చెప్పారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యల గురించి ప్రధానికి వివరించారు. భవిష్యత్తులో ఎదురయ్యే




సవాళ్లను ఎదుర్కోవడానికి సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని ప్రధాని పునరుద్ఘాటించారు.

# స్వామివారికి పట్టు వస్త్రాలు ఏరుకొండ దంపతులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, భద్రాద్రి కొత్తగూడెం :**
చర్ల మండలం గొమ్ముగూడెం రామాలయంలో 11వ వార్షిక శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకొని గొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాతలు ఏరుకొండ. రాంబాబు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, సీతమ్మ వారి కళ్యాణానికి ఆవుల. మదన్మోహన్ రెడ్డి, నాగరాజా దంపతులు మంగళ సూత్రాలు, మెట్టెలు. భక్తులకు పులిహోర, పానకం స్వామి వారికి దండలు పోట్రు. బ్రహ్మానందరెడ్డి దంపతులు, ఉత్సవ విగ్రహానికి ఎర్రగడ్డ గ్రామానికి చెందిన నాని బాబు దంపతులు, ఇత్తడి మకర తోరణం, ఇత్తడి కిరీటాలు స్వామివారికి పూజారి. గణపతి, వెంకటరత్నం దంపతులు. స్వామివారికి వెండి యజ్ఞోపవీతం తడికెల. వెంకటేశ్వర్లు, లక్ష్మీ దంపతులు ఇలా దాతల అందరి సహకారంతో స్వామివారి కల్యాణాన్ని ఆలయ పూజారి భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవపేతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు పానకం పులిహోర అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో శు క్రవారం నాడు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రక్త నిల్వలు కొరత ఏర్పడిన అత్యవసర పరిస్థితుల కారణంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు మీ అపారమైన సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నారాయణఖేడ్ మ్యాన్స్ క్లబ్ టీంకు ఆసుపత్రి సిబ్బంది లకు మరింతగా ఇలాంటి రక్తదాన కార్యక్రమాలు నిర్వహించలని కోరుకుంటూ రక్తదాన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో 52 మంది దాతలు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సాయి సంగమేశ్వర సెట్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు,రాజ్ కుమార్, చంద్రశేఖర్ ఆచార్య,రాజ్ కుమార్, వెంకట్ రావు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, నారాయణఖేడ్ :**
శ్రీరామనవమి సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి సతీమణి మహా రెడ్డి జయశ్రీ రెడ్డి వారితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు స్వప్న అభిషేక్ శెట్కార్, విజయ్ బుజ్జి, నాయకులు భక్తులు తదితరులు ఉన్నారు.




## శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి దంపతులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీరామ మందిరంలో శుక్రవారం నాడు శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొని సీతారాముల స్వామి వారికి ప్రత్యేక పూజల్లో స్వామివారికి అభిషేకాలు ఆరతుల అర్పించి ప్రత్యేక మంత్రపుష్పాలు సమర్పించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల అనుపమ సంజీవరెడ్డి దంపతులు, పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, నగేష్ కుమార్ శేట్కర్ మున్సిపల్ చైర్మన్ దంపతులు, సాగర్ శేట్కర్ యువ నాయకులు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మరియు బాణాపురం రాజు, రుక్మిణి గోపాల్ రెడ్డి, షారుఖాన్, వివేకానంద, మహేష్ చౌహాన్, మైతాబ్, సుబుర్, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు..!

- సిద్ధేశ్వరానందగిరి మహారాజ్
- ముగిసిన రామనవమి వేడుకలు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, ఝరాసంగం :** శ్రీరాముడు ధర్మానికి ప్రతిరూపమని, తండ్రికి విధేయత, భార్యకు పిల్లలకు అన్నదమ్ములకు ప్రజలందరికీ న్యాయం అందించిన ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్ర ప్రభువు అని మహామండలేశ్వర్, బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా సంగారెడ్డి ఝరాసంగం పరిధిలోని బర్దిపూర్, కుప్పా నగర్, ఏడాకులపల్లి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రామనవమి వేడుకల్లో ఆయన పాల్గొని భక్తులకు ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనామృతాన్ని అందించారు. రాజ్య పాలనలోనూ, వనవాసంలోనూ, యుద్ధాల్లోనూ సత్యం, ధర్మం, న్యాయం మార్గాన్నే అనుసరించినవాడే శ్రీరాముడు అని తెలిపారు. రామనామ స్మరణతో మనసుకు ప్రశాంతత కలుగుతుందని, ధర్మ మార్గంలో నడిచే శక్తి లభిస్తుందని అన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.


## శ్రీ సీతరాముల కళ్యాణ మహోత్సవలలో పాల్గోన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని రాజపేట, బేగంపేట, పారుపల్లి, మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతరాముల వారి కళ్యాణ మహోత్సవలలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మాజీ జెడ్పీటీసీ చామకూర గోపాల్, మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు, బిఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, రాజపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెడిద వీరేశం, మాజీ సర్పంచి గుంటి మధుసూదన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, గుంటి కృష్ణ, కటకం వెంకటేశం, దగ్గుల విష్ణు, కనకయ్య, రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గొంగిడి సునీత మహేందర్ రెడ్డిని అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.

# తెలంగాణలో 'క్యాన్సర్' ప్రమాద ఘంటికలు..!

## 'నోటి క్యాన్సర్' బాధితులే అధికం..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, మెయిన్ డెస్క్:** తెలంగాణలో క్యాన్సర్ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఏడాదికి ఏడాది క్యాన్సర్ కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రథమ దశలో క్యాన్సర్‌ను గుర్తించకపోవడంతో.. మరణాల సంఖ్య కూడా అధికమవుతుంది. మొత్తంగా క్యాన్సర్ కేసులను గుర్తించడంలో తెలంగాణ నిశ్శబ్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితికి కారణం.. స్క్రీనింగ్ రేటు అత్యంత తక్కువగా ఉండటమే అని నివేదికలు చెబుతున్నాయి. చివరి దశలో క్యాన్సర్ బయటపడడంతో.. అప్పటికే అది ముదిరి ప్రాణాలను బలి తీసుకుంటుందినిమ్స్‌లోని ఐసీఎంఆర్ – నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్ అండ్ రీసెర్చ్ తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్ 2026 నివేదికను శుక్రవారం విడుదల చేసింది. ఈ నివేదికలో ఆందోళనకరమైన విషయాలు వెల్లడి అయ్యాయి. 30 నుంచి 49 ఏండ్ల వయసు గల వ్యక్తుల్లో స్క్రీనింగ్ కొరవడిందని నివేదికలో పేర్కొన్నారు. చాలా మంది ముందుస్తుగా స్క్రీనింగ్ చేయించుకోకపోవడం వల్లే క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి.. ముదిరిన తర్వాత బయటపడుతుంది. దీంతో చికిత్స కష్టంగా మారడంతో పాటు ఖరీదైనదిగా కూడా మారుతోంది. అటు చికిత్స చేయించుకోలేక, ఇటు ఖర్చు భరించలేక.. చివరకు ప్రాణాలను కోల్పోతున్నారు.

**రొమ్ము క్యాన్సర్ అత్యంత సాధారణం**

పురుషులలో అత్యంత సాధారణమైన క్యాన్సర్ నోటి క్యాన్సర్. ఈ క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఉద్దేశించిన పరీక్షను కేవలం 2.6 శాతం మంది పురుషులు మాత్రమే చేయించుకున్నారు. మహిళల విషయానికి వస్తే రొమ్ము క్యాన్సర్ అత్యంత సాధారణంగా మారిపోయింది. 0.3 శాతం మంది మహిళలు మాత్రమే క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్ చేయించుకున్నారు. మహిళలో రెండో అత్యంత సాధారణ క్యాన్సర్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. దీన్ని కేవలం 3.3 శాతం మంది మహిళలు మాత్రమే ఇప్పటి వరకు స్క్రీనింగ్ చేయించుకున్నారు.

**క్యాన్సర్‌కు అతిపెద్ద కారకం పొగాకు**

55 శాతం మంది పురుషుల్లో, 62 శాతం మంది మహిళల్లో స్టేజ్ 4లోనే క్యాన్సర్ నిర్ధారణ అవుతుంది. అయితే అప్పటికే క్యాన్సర్ కారకాలు ఇతర అవయవాలకు వ్యాపించి.. వ్యాధి మరింత ముదురుతుంది. దీంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. తెలంగాణలో క్యాన్సర్‌కు అతిపెద్ద కారకం పొగాకు అని తేలింది. పొగాకు వినియోగం వల్లే పురుషుల్లో 58.8 శాతం మంది, మహిళల్లో 29.7 శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. 2026 నాటికి పురుషుల్లో 21,252 కొత్త కేసులు నమోదు కాగా, మహిళల్లో 25,510 కొత్త కేసులు నమోదు అయ్యాయి. ఈ ఒక్క ఏడాదిలోనే చిన్నారులు, కౌమారదశలో ఉన్నవారిలో 1,199 కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతాయని నివేదిక అంచనా వేస్తోంది. ఈ నివేదిక విడుదల సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగరి బీరప్ప మాట్లాడారు. క్యాన్సర్‌పై ముందుగానే ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్న దానికి ఈ నివేదికనే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సదాశివుడు గుండేటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను చేయించుకోవాలని సూచించారు. అప్పుడే క్యాన్సర్‌ను నివారించే అవకాశం ఉంటుందన్నారు.

తెలంగాణలో క్యాన్సర్ కేసులు ఇలా..

-19 ఏళ్లకు పైబడిన వారిలో 21,252 మంది పురుషులు, 25,510 మంది మహిళలు క్యాన్సర్ బారిన పడ్డారు.

-హైదరాబాద్ నగరంలో 0–74 ఏండ్ల మధ్య వయసు వారిలో 8 మందిలో ఒకరికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

-పురుషుల్లో 55 శాతం, మహిళల్లో 62 శాతం క్యాన్సర్ కేసులు స్టేజ్4లోనే బయటపడుతున్నాయి.


-పురుషుల్లో వచ్చే మొత్తం క్యాన్సర్ కేసుల్లో 58.8 శాతం కేసులు పొగాకు వల్లే సంభవించాయి.

-15.3 శాతం మంది నోటి క్యాన్సర్‌తో, 9.7 శాతం లంగ్స్ క్యాన్సర్‌తో, 8.8 శాతం మంది కోలోరెక్టమ్ (పెద్దపేగు) క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

-మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు సంబంధితమైనవే.

-27.9 శాతం మంది రొమ్ము క్యాన్సర్, 12.7 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, 6 శాతం మంది పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

## అద్భుతం! నుదుటిన సూర్య తిలకం, బాలరాముడికి భానుడి వందనం






**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, ఉత్తరప్రదేశ్ :** అయోధ్య గడ్డపై బాలరాముడు కొలువుదీరిన వేళ, నేడు శ్రీరామనవమి పర్వదినాన మరోసారి అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. కోట్లాది మంది భక్తుల కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన ఆ 'సూర్య తిలక' ఘట్టం భక్తజనాన్ని పరవశింపజేసింది. మధ్యాహ్నం సరిగ్గా అభిజిత్ లగ్నంలో, సూర్యభగవానుడు తన కిరణాలతో తన వంశ అంకురమైన రామ్‌లల్లా పాదాలను కాక, నేరుగా నుదుటిని తాకుతూ 'దివ్య తిలకాన్ని' దిద్దారు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన భక్తులు 'జై శ్రీరామ్' నినాదాలతో అయోధ్యాపురిని మారుమోగించారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ప్రాచీన ఆధ్యాత్మిక సంప్రదాయం మేళవించిన ఈ అద్భుత ప్రక్రియలో భాగంగా.. సరిగ్గా మధ్యాహ్నం వేళ సూర్యకిరణాలు ఆలయ శిఖరం నుంచి దర్పణాల ద్వారా ప్రయాణించి బాలరాముడి విగ్రహం నుదుటిపై కేంద్రీకృతమయ్యాయి. సుమారు కొన్ని నిమిషాల పాటు రామ్‌లల్లా ఫాలభాగం నారాయతేజస్సుతో ధగధగలాడిపోయింది. ఈ అద్భుత వేడుకను ప్రధాని నరేంద్ర మోడీ వీక్షించి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. రామ్‌లల్లాకు ప్రార్థనలు సమర్పిస్తూ, ఈ ఘట్టం ప్రతి భారతీయుడికి గర్వకారణమని ఆయన అభివర్ణించారు. అటు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్‌లో పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ప్రతి భారతీయుడికి శాశ్వత స్ఫూర్తి అని, భారతీయ జీవన విధానానికి సనాతన ధర్మమే అత్యున్నత ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.

అబ్బురపరిచే సాంకేతికత: గేర్ టీత్ మెకానిజం

ఈ సూర్య తిలక ఘట్టం వెనుక భారతీయ శాస్త్రవేత్తల అద్భుత మేధస్సు దాగి ఉంది. గడియారంలోని ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే 'గేర్ టీత్ మెకానిజం' తరహా పరిజ్ఞానాన్ని ఇక్కడ వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే అద్దం 365 రోజులూ స్వల్పంగా కదులుతూ ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక పరికరాలను అమర్చారు. ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించి, సరిగ్గా ఆ రోజున సూర్యకిరణాలు రామ్‌లల్లా నుదుటిపై పడేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ఈ వేడుక దైవిక ఆశీర్వాదాలకు ప్రతీకగా నిలవడంతో పాటు, భారతీయ సంప్రదాయం మరియు ఆధునిక విజ్ఞాన శాస్త్రాల అపూర్వ సమ్మేళనాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

దేశ వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారాలు:

ఈ అపూర్వ ఘట్టాన్ని భక్తులందరూ వీక్షించేలా ఆలయ అధికారులు అయోధ్య అంతటా భారీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు ఒకేసారి ఆ దివ్య తిలకాన్ని చూసి తరించారు. రామాయణ సీరియల్‌లో రాముడిగా మెప్పించిన బీజేపీ ఎంపీ అరుణ్ గోవిల్ సైతం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. రాముడు చూపిన ధర్మ మార్గంలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు.

భద్రాద్రి రాముడి గోత్రం ఏంటి? మీకు తెలుసా?

తొమ్మిది రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు, నేడు రామ్‌లల్లా దివ్య దర్శనంతో పులకించిపోయారు. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భారతీయుల ఆత్మగౌరవం సూర్యతేజస్సులా వెలుగులీనుతోందని నిరూపించిన చారిత్రాత్మక క్షణం.

## యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్: ప్రధాని మోదీ పచ్చజెండా!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, ఢిల్లీ:** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు రైలు ప్రయాణం మరింత సులభం కానుంది. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా సికింద్రాబాద్ నుంచి రాయగిరి వరకు కొత్త రైల్వే మార్గానికి ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ మొదటి వారంలో పచ్చజెండా ఊపనున్నారు. ఈ ప్రాజెక్టుతో భక్తులకు తక్కువ ఖర్చుతో వేగవంతమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది.

**పట్టాలెక్కనున్న యాదగిరిగుట్ట రైల్వేలైన్**

యాదగిరిగుట్టకు మల్టీమోడల్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) ప్రాజెక్టు ఏప్రిల్ మొదటివారంలో పట్టాలెక్కనుంది. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు భక్తులు ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టు పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏప్రిల్ మొదటివారంలో ప్రారంభించనున్నారు. రాయగిరి వరకు రైల్వేలైన్ నిర్మాణం కోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ పనులు ప్రారంభించనుంది. ఇప్పటికే భూసేకరణ పూర్తి అయింది. సికింద్రాబాద్ నుంచి మౌలాలి– చర్లపల్లి, ఘట్ కేసర్ మీదుగా రాయగిరి వరకు 33 కిలోమీటర్ల రైలు మార్గాన్ని 430కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. ఈ మార్గం నిర్మాణం పూర్తి అయితే హైదరాబాద్ నగరం నలుమూలల నుంచి లింగంపల్లి, మేడ్చల్, ఉందానగర్, సికింద్రాబాద్ నుంచి సులభంగా యాదగిరిగుట్టకు వెళ్లవచ్చు.

**నామమాత్రపు చార్జీతో రైలు ప్రయాణం**

హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఎంఎంటీఎస్ సర్వీసులు తిరుగుతున్నాయి. నాంపల్లి –లింగంపల్లి, ఫలక్ నుమా– లింగంపల్లి, లింగంపల్లి – హైదరాబాద్, లింగంపల్లి – హైటెక్ సిటీ, సికింద్రాబాద్–లింగంపల్లి, ఫలక్ నుమా –హైదరాబాద్, సికింద్రాబాద్–బొల్లారం–మేడ్చల్, ఫలక్ నుమా–ఉందానగర్–శంషాబాద్ విమానాశ్రయం, సికింద్రాబాద్–మౌలాలి–ఘట్ కేసర్, మౌలాలి– సనత్ నగర్, కాచిగూడ–సీతాఫల్ మండీ– మల్కాజిగిరి–మౌలాలి రైళ్లు నడుస్తున్నాయి. కేవలం 5,10,15 రూపాయల చార్జీతోనే ఎంఎంటీఎస్ రైళ్లు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి.



**ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచండి : సీఎం**

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు నడపాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని సీఎం కోరారు. ఎంఎంటీఎస్‌లో ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

**లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచండి**

ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం వల్ల ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని తేలింది. ఎంఎంటీఎస్ స్టేషన్లు లోపలికి ఉండటంతో అక్కడకు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుపరచడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ, ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు మెరుగుపడితే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. భక్తులకు చవకగా, సురక్షితంగా, వేగవంతంగా ప్రయాణం అందిస్తూ ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజా రవాణా రంగానికి కొత్త దిశ చూపనుంది.

# కన్నుల పండువగా సీతా రాముల కళ్యాణ మహోత్సవం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, జహీరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) శివారులోని మధునగర్ కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. మధ్యాహ్నం సీతారాముల కళ్యాణం వేదమంత్రాల మధ్య జరిగింది. ముత్యాల తలంబ్రాలు చల్లుతూ కళ్యాణం నిర్వహించారు.వేలాది మంది భక్తులు ఈ కల్యాణ మహోత్సవంను తిలకించారు. దైవ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసారు. భక్తులకు నిర్వాహకులు సత్యనారాయణ బ్రదర్స్ వసతులు కల్పించారు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశినాథ్ తమ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేసారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వేల సంఖ్యలో హాజరైన భక్తుల మధ్యలో కోదండ రామాలయంలో రాములోరి కళ్యాణం ఘనంగా జరిగింది.





# ఏజెన్సీ చట్టాలను వెక్కిరిస్తున్న గిరిజనేతరుల అహంకారం!

**సర్పంచ్‌పై చెప్పుతో దాడి చేసిన పొరుగు రాష్ట్ర వ్యక్తి!**
**నిందితులను అరెస్ట్ చేయాలని గ్రామస్తులు డిమాండ్!**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండల పరిధిలోని కావడిగుండ్ల గ్రామంలో గిరిజన హక్కులు, ఆత్మగౌరవం ప్రశ్నార్థకంగా మారాయి. 1/70 వంటి కఠినమైన ఏజెన్సీ చట్టాలు అమల్లో ఉన్న ప్రాంతంలో, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక గిరిజన సర్పంచ్‌పై అధికారుల ముందే ఒక గిరిజనేతరుడు చెప్పుతో దాడి చేయడం తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది. కావడిగుండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఒక విచారణకు రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి హాజరయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బుట్టాయిగూడెంకు చెందిన గిరిజనేతరుడు గుబ్బల సత్యంబాబు, తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా విచారణలోకి చొరబడ్డారు. గిరిజన సర్పంచ్ బాడిశ లక్ష్మణరావును, మాజీ ఎంపీటీసీ వాసం బుచ్చిరాజును లక్ష్యంగా చేసుకుని కులం పేరుతో దూషిస్తూ, అధికారుల సమక్షంలోనే సర్పంచ్ బాడిశ లక్ష్మణరావు, గ్రామ పెద్ద కణితి జగ్గయ్యను చెప్పుతో కొట్టి అమానుషంగా ప్రవర్తించారు. నీ అంతు చూస్తాను అంటూ వేలు చూపిస్తూ బహిరంగంగానే ప్రాణహాని తలపెడతామని బెదిరించారు. గుబ్బల సత్యంబాబుకు కావడి గుండ్ల గిరిజనేతరులైన తుమ్మూరు ప్రసాద్, జాడి బాబురావు, షేక్ బషీర్ తో పాటు కావడిగుండ్ల గ్రామ గిరిజనులైన కుంజా బుచ్చిరాజు, గోవిందు లు ప్రత్యక్షంగా సహకరించారు. వారు కూడా సర్పంచ్ బాడిశ లక్ష్మణరావు పై దాడి చేశారు. వీరిపై వెంటనే కఠిగిన చర్యలు తీసుకొని శిక్షించాలని కావడిగుండ్ల గ్రామస్తులు కోరుతున్నారు.



**అధికారుల మౌనం రాజకీయ జోక్యంపై అనుమానాలు**

ఈ ఘటన అధికారుల కళ్లముందే జరిగినా, నిందితుడు పక్క రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడం, రాజకీయ అండదండలు ఉండటంతో కేసును నీరుగార్చే అవకాశం ఉందని గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. కానీ, బయటి వ్యక్తులు ఇక్కడకు వచ్చి ప్రజాప్రతినిధులపైనే భౌతిక దాడులకు దిగడం గిరిజన ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ఈ ఘటనపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని, వీరికి సహకరించిన, దాదాడిలో పాల్గొన్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో
# శ్రీ శ్రీ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



**ఎల్బీనగర్, మార్చి 27 (జయహే తెలంగాణ):** ఎల్బీనగర్ నియోజకవర్గం కర్మన్ ఘాట్ ప్రాంతంలో స్వయంభూ శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానములో శుక్రవారం శ్రీరామ నవమి పర్వదినమును పురస్కరించుకొని దేవస్థానములో వేంచేసి యున్న శ్రీ కోదండ రామాలయములోని శ్రీ సీతారామచంద్ర స్వామి వార్లకు తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకము, అలంకారము, ఎదుర్కోళ్ళు ఆద్యాంతం కన్నుల పండుగ సాగింది. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కళ్యానోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సతీ సమేతంగా ఆలయమునకు విచ్చేసి స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అలయ కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ, ధర్మకర్తలు కూడా స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు సమర్పించారు. అసంఖ్యాకంగా విచ్చేసిన భక్తులు కళ్యాణోత్సవాన్ని తిలకించి పులకించారు. కళ్యాణ వేదికకు దూరంగా యున్న భక్తుల సౌకర్యార్థము 2 ఎల్.ఇ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేసి కళ్యాణోత్సవాన్ని స్పష్టంగా చూసే అవకాశాన్ని కల్పించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులతో క్రిక్కిరిసిన దేవస్థానములో భక్తుల సౌకర్యార్థము మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదము, అన్నదానములు ఏర్పాటు చేశారు. కళ్యాణోత్సవము టిక్కెట్టు పొందిన భక్తులకు ఆలయ అర్చకులచే కంకణ ధరణ గావించి వారికి ఆశీర్వచనము, స్వామి వారి శేష వస్త్రములతో పాటు ప్రసాదములు, మాజీ చైర్మన్ నల్ల రఘుమా రెడ్డిచే సుమారు 1000 మందికి అన్నప్రసాదములు, సాధారణ భక్తులు సుమారు 15000 మందికి స్వామీ వారి భక్తులు శ్రీ రాజేంద్ర కుమార్ బృందం ద్వారా అన్నదానములు ఏర్పాటు చేయడం జరిగిందని ఈవో వెల్లడించారు. అందంగా పూలు, విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికలో ఆలయ వేద పండితులు, అర్చకులు శ్రీ స్వామి వారి కళ్యాణ విశిష్టతను తెలుపుతూ చేసిన కళ్యాణోత్సవమును తిలకించి, దేవస్థానము ద్వారా చేసిన ఏర్పాట్లపై భక్తులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. కళ్యాణోత్సవమునకు విచ్చేసి కళ్యాణాన్ని తిలకించిన భక్తులకు ఆలయము తరపున కార్యనిర్వహణాధికారి, చైర్మన్, ధర్మకర్తలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యన్.లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ, ధర్మకర్తలు దిండు ప్రవీణ్ గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ్ దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, కె. కవిత, ఓరుగంటి నరేష్, కొంద్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, ఎనుముల రవీందర్ రెడ్డి, యం. రాజేశ్వరి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## జిల్లా కార్యవర్గంలో రాజపేట మండలంలో
# మరో ఇద్దరికీ స్థానం కల్పించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య రాజపేట మండలంలో మరో ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించారు. బొందుగుల గ్రామానికి చెందిన మసిరెడ్డి సురేందర్ రెడ్డిని డిసిసి ప్రధాన కార్యదర్శిగా, పిట్టల జయరాములు ను కార్యదర్శిగా నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు అవకాశం ఇచ్చినందుకు బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్,



సీనియర్ నాయకులు మెండు భాస్కర్ రెడ్డి, బొందుగుల గ్రామ శాఖ అధ్యక్షులు బాల్ద శ్రీకాంత్, శేఖర్, నరేష్, సంతోష్, బాలయ్య తదితరులు ఉన్నారు.

# శ్రీ రామ నవమి ఉత్సవాల్లో సీతారామ కల్యాణ మహోత్సవం, అన్నదానం

**మాజీ జెడ్పిటిసి గడిల శ్రీకాంత్ గౌడ్**





**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27 :** ఇస్నాపూర్ ఎక్స్‌రోడ్డు, ఆంధ్రా కాలనీ, తేజా కాలనీ, ఇస్నాపూర్ విలేజ్, పాశ్చిమైలారం, రుద్రారం, ముత్తంగి డివిజన్‌లోని డీఎన్ కాలనీ, నాగార్జున కాలనీ శివాలయాల్లో శ్రీ రామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అన్నదానం నిర్వహించారు. పటాన్‌చేరు మండల ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ మచ్చ కిషోర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్, ముత్ధంగి గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో రైతులకు డ్రోన్ స్ప్రే యంత్రాల పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కాగజ్‌నగర్ మండలంలో (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) పథకం కింద 40% సబ్సిడీతో మంజూరైన డ్రోన్ స్ప్రే యంత్రాలను పంపిణీ చేశారు. సొసైటీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొని యంత్రాలను అందజేశారు.సిర్పూర్ నియోజకవర్గంలోని కొత్తపేట, దహేగావ్, గురుడుపేట ప్యాక్స్ సంఘాలకు ఈ డ్రోన్ యంత్రాలు ఇవ్వబడినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న యంత్రాలను వినియోగించుకుని ఉత్పాదకత పెంచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు వెంకటి, రామకృష్ణ, రేష్మిత, సొసైటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సోమరంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం సోమరం గ్రామంలో శుక్రవారం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీనీ గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, ఉప సర్పంచ్ జంగ శ్రీకాంత్, వార్డు సభ్యులు గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. ఆలయ పూజారిగా మాటూరి సంతోష్, గౌరవ అధ్యక్షులుగా గొంగిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, శీలం అశోక్ రెడ్డి, అధ్యక్షులు నారెడ్డి కమలాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నం సిద్దిరాజు, తవిటి కరుణాకర్, కోశాధికారి జంగ వేణు, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, జొన్న నర్సిరెడ్డి, పుప్పాల నర్సయ్య, జంగ సిద్ధులు, శీలం తిరుమలానందరెడ్డి, పుప్పాల సతీష్, బూడిద సురేష్, నూతన కమిటీ సభ్యులను శ్రీ మల్లికార్జున స్వామి భక్తజనం ఘనంగా సత్కరించారు.

# "పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి : బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు, కేంద్ర మంత్రి బండి డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, తెలంగాణ బ్యూరో :** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం జనరంజకమైన నిర్ణయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా దేశ ప్రజలకు తీపి కబురు అందించిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా సున్నా స్థాయికి తగ్గించడం మోడీ పరిపాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. పెట్రోల్‌పై కూడా రూ 10 మేర భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుంది.. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణలో వ్యాట్ సుమారు 35 శాతం ఉండటంతో సామాన్యుడిపై పెను భారం పడుతోంది. కేంద్రం పన్నులు తగ్గిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు, ఆయిల్ బాండ్ల భారం ఉన్నా కేంద్రం వెనక్కి తగ్గలేదు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పిండుతోంది. పెట్రోల్ ధరలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటాయే ఎక్కువగా ఉండటం అత్యంత దురదృష్టకరం అన్నారు. సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికైనా మాటల గారడీలు పక్కన పెట్టి, తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి. రాష్ట్ర ప్రభుత్వం తన పన్ను వాటాను తగ్గిస్తేనే పెట్రోల్ ధర రూ. 100 లోపు వచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యుడికి నిజమైన ఊరట నివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించాలి : బండి సంజయ్**

ప్రజా సంక్షేమ నిర్ణయాలు తీసుకోవడంలో ఎన్డీఏ ప్రభుత్వం అగ్రభాగాన ఉంటుందనడానికి పెట్రోల్, డీజిల్పై



ఎక్సైజ్సుంకం తగ్గించడమే నిదర్శనమని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించాలి. ప్రజలకు పెట్రోల్, డీజిల్ ధరలను మరింతగా అందుబాటులోకి తేవాలి. చమురు ధరలు తగ్గిస్తే సంక్షోభ సమయంలో నిత్యావసర వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రజల మేలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్రోల్, డీజిల్ పై వెంటనే వ్యాట్ తగ్గించాలని డిమాండ్చేశారు.

## కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో

# షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్.సి) నియోజకవర్గ రిజర్వేషన్ కల్పించాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో తెలంగాణ దళిత యువజన సంగం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సంగం వ్యవస్తాపాక అధ్యక్షులు ఈర్ల సునీల్, మాజీ కౌన్సిలర్ గోడిసేలా ఎల్లేష్, సంగం నాయకులు ఐల్ల శంకర్, బోగా తిరుపతి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో ఒకటి. ఈ జిల్లాలో షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్.సి) ప్రజలు గణనీయమైన సంఖ్యలో నివసిస్తున్నారు. అయినప్పటికీ, ప్రస్తుతం జిల్లాలో ఎస్.సిలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదు.భారత రాజ్యాంగం ప్రకారం సామాజిక న్యాయం, సమాన హక్కులు అందరికీ కల్పించడానికి షెడ్యూల్డ్ కాస్ట్ వర్గాలకు రిజర్వేషన్ ఏర్పాటు చేయబడింది. అయితే కొమురం భీమ్ జిల్లాలో ాజ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, తగిన విధంగా నియోజకవర్గ రిజర్వేషన్ ఇవ్వబడలేదు. దీనివల్ల ఎస్.సి సమాజానికి చెందిన ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అభివృద్ధి, సామాజిక సమానత్వం, మరియు ప్రజాస్వామ్య బలోపేతం కోసం కొమురం భీమ్ జిల్లాలో ఒక నియోజకవర్గాన్ని ఎస్.సి రిజర్వేషన్ గా ప్రకటించాల్సిందిగా మనవి చేస్తున్నాము అని అన్నారు.అందువల్ల ఎన్నికల సంఘం మరియు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి కొమురం భీమ్ జిల్లాలో ఎస్.సి రిజర్వ్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని మేము వినయపూర్వకంగా కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డు5



కౌన్సిలర్ ఐ పోచం, వేల్పుల ప్రదీప్, గోగార్ల దుర్గయ్య, మారుతీ, మచ్చ నరేందర్, కాల్వల చైతన్య, రవి, ఆశీర్వాదం, దుర్గయ్య, రాజయ్య, అల్లూరి సాయి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిస్కెట్‌లో ప్లాస్టిక్.. బ్రిటానియా, డి-మార్ట్‌కు వినియోగదారుల కమిషన్ షాక్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, తెలంగాణ బ్యూరో:** బిస్కెట్ ప్యాకెట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు రావడంపై దాఖలైన కేసులో ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ బ్రిటానియా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, డి-మార్ట్‌లకు తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ గట్టి షాక్ ఇచ్చింది. జిల్లా ఫోరం ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బ్రిటానియా దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ, బాధిత వినియోగదారునికి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. 2019లో అడ్వకేట్ సంధ్య యాదవ్ సనత్ నగర్‌లోని డి-మార్ట్ స్టోర్‌లో తన నాలుగేళ్ల కుమార్తె కోసం బ్రిటానియా డైజెస్టివ్ బిస్కెట్లను కొనుగోలు చేశారు. బిస్కెట్లు తినిపిస్తున్న సమయంలో ఒక బిస్కెట్ లోపల ప్లాస్టిక్ కవర్ ముక్క ఇరుక్కుపోయి ఉండటాన్ని ఆమె గమనించారు. నాణ్యత లేని ఆహార పదార్థాల వల్ల తన బిడ్డ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లిందంటూ ఆమె 2019 మార్చిలో జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు.

**రూ.25వేల పరిహారాన్ని చెల్లించాలి**


స్టేట్ టెస్ట్ లాబొరేటరీ నిర్వహించిన పరీక్షల్లో బిస్కెట్‌లో ఉన్నది ప్లాస్టిక్ వ్యర్థమేనని తేలింది. దీనిని తీవ్రమైన సేవా లోపంగా పరిగణించిన జిల్లా ఫోరం.. బాధితురాలికి కలిగిన మానసిక క్షోభకు గాను రూ.25వేల పరిహారాన్ని బ్రిటానియా, డి-మార్ట్ సంయుక్తంగా చెల్లించాలని గతంలోనే ఆదేశించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ బ్రిటానియా సంస్థ ఖైరతాబాద్‌లోని రాష్ట్ర కమిషన్‌లో అప్పీల్ చేసింది. అయితే సుదీర్ఘ వాదనల అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 25న రాష్ట్ర కమిషన్ తుది తీర్పు వెలువరించింది. జిల్లా ఫోరం




నిర్ణయాన్ని సమర్థిస్తూ, అప్పీల్‌ను కొట్టివేసింది. జరిమానా మొత్తంతో పాటు అప్పటి నుంచి ఇప్పటి వరకు లెక్కించి వడ్డీని కూడా కలిపి సంధ్య యాదవ్‌కు చెల్లించాలని కమిషన్ స్పష్టం చేసింది.

## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో

# శాస్త్రబద్ధంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల్ కేంద్రంలోనీ శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయంగా భక్తజనుల మధ్య జరిగింది. ఆకాశమంత పందిరి భూదేవి అంత వేదిక సకల దేవతలు దివి నుండి భువికి దిగివచ్చినట్లుగా శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా జరిగింది. రాజపేట మండలం లోని అన్ని గ్రామాలలో శ్రీ స్వామివారి కళ్యాణ తంతు ఘనంగా జరిగింది. అందుకోసం పలు ఏర్పాట్లను చేసి తమ భక్తిని శ్రద్ధలను చాటుకున్నారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ శాశ్వత అధ్యక్షులు నంగున కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ వైదిక కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. మొదటగా ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఎదుర్కోలు మహోత్సవం అనంతరం పూలమాలలు పచ్చని తోరణాలతో అందంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై కళ్యాణమూర్తులకు కంకణా ధారణ, జన్యోపవేతం, పూల మాలల అలంకరణ నూతన వస్త్రాలంకరణ జీలకర్ర బెల్లం ప్రధానం మాంగల్య సూత్రధారణ తలంబ్రాలు వడి బియ్యం సమర్పణ ఇత్యాది ముఖ్య ఘట్టాలను అద్భుతంగా నిర్వహించారు. 11 జంటలు కళ్యాణంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, చల్లూరు ధ్యాన్ ఫౌండేషన్ గోశాల నిర్వాహకురాలు పూనం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజపేట కు చెందిన 2005 -06 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. దాతలను సత్కరించి కృతజ్ఞతలు చెప్పారు. రాత్రి పల్లకి సేవా



కార్యక్రమం జరిగింది. శ్రీరామనవమి సందర్భంగా గ్రామం అంతా పూర్తి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు శ్రీ రామనామ స్మరణతో మార్మోగింది.

# నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 27, వర్గల్:**

శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగాయి. వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాలలో తోపాటు వివిధ గ్రామాల్లో గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా విశేష భక్తజన సందోహంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్తా కళ్యాణ మహోత్సవానికి ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు సమర్పించారు. నాచారం దేవస్థానం వద్ద ఉదయం 11 గంటలకు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణమండపంలో అదృష్టంపజేసి సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోత్సవాలతో వైభవంగా నిర్వహించగా, వర్గల్ వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద నున్న కళ్యాణ మండపంలో రాత్రి 8 గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు భూమి పూజ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కుర్రారం గ్రామ పంచాయతీ ఆవరణలో హిందూ యువ వాహిని కుర్రారం ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి పర్వదినాన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ధర్మ రక్షణ, హిందూ ఐక్యత మరియు స్వాభిమానానికి ప్రతీకగా ఈ కార్యక్రమం గ్రామంలో విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ లు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ పవిత్ర కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హిందూ యువవాహిని కుర్రారం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఇలాంటి ధార్మిక మరియు సామాజిక కార్యక్రమాల్లో ఇక ముందు కూడా మీ అందరి సహకారం ఇలానే కొనసాగాలని ఆశిస్తున్నామన్నారు.

# హైదరాబాద్‌లో ఉస్మానియా బిస్కెట్ ఫ్యాక్టరీపై పోలీసుల దాడి

## విష రసాయనాలు, పాడైన గుడ్ల వాడకం వెలుగులోకి




**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 27, మెయిన్ డెస్క్ :**

హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ప్రాంతంలో ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ఒక ఫ్యాక్టరీపై పోలీసులు దాడులు నిర్వహించి, షాకింగ్ నిజాలను వెలుగులోకి తెచ్చారు. ఈ ఘటనతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు.పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో, బిస్కెట్లకు ఆకర్షణీయమైన రంగులు అద్దడానికి ప్రాణాంతకమైన రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ రసాయనాలు మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే అవకాశం ఉంది. ఇంకా, తక్కువ ధరకు లభ్యమవుతున్నాయని భావించి, కుళ్ళిపోయిన, పాడైన గుడ్లను కూడా బిస్కెట్ల తయారీలో వాడుతున్నట్లు ఆధారాలతో సహా అధికారులు పట్టుకున్నారు. ఇది ఆహార భద్రతా ప్రమాణాలకు విరుద్ధం.ఫ్యాక్టరీలో కనీస పరిశుభ్రత పాటించకుండా, ఈగలు ముసురుతున్న మురికి వాతావరణంలో బిస్కెట్లను తయారు చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ దృశ్యాలు ఆహార ఉత్పత్తి కేంద్రాలలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి అన్ని చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

## కుటుంబ సమేతంగా శ్రీరామనవమి వేడుకలల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత, ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట మండలం సైదాపూర్, మైలార్ గూడెం, వంగపల్లి, యాదగిరిగుట్ట పట్టణంలోని ఐదవ వార్డు, అరవ వార్డు, శ్రీరామ్ నగర్ లో, తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో, రాముల గుట్ట పైన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆలేరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతా - ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026-2027వ ఆర్థిక సంవత్సరం యొక్క బడ్జెట్ ప్రత్యేక సమావేశనికి సంబంధించిన అంశాలను ఇందులో చర్చించిచారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాం. రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ వంటి ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించాం. స్వచ్ఛతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. తాగునీటి సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించాం. మన పట్టణ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలి. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించడం మన బాధ్యతన్నారు. ప్రతి వార్డులో ప్రాథమిక సదుపాయాలు మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మంచి జీవన ప్రమాణాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుతున్న సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించాలనే విషయంపై చర్చించాం. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించాం. పన్నులు, ఆదాయ వనరుల పెంపు ద్వారా మున్సిపాలిటీ ఆర్థిక స్థితి బలపడేలా కృషి చేయాలని సూచించాం. ప్రజల సమస్యలను వినేందుకు వార్డు స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

## రఘునాథపురం రామస్వామి గుట్ట వద్ద వైభవంగా శ్రీ సీతారాముల తిరు:కళ్యాణ మహోత్సవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో అతి మహిమానితమైన రామస్వామి గుట్ట త్రేతాయుగంలో సీత అన్వేషణకై వెళుతూ ఈ కొండపై శ్రీరాముడు తన పాదం మోపి శివలింగం ప్రతిష్టించి పూజించి శ్రీరామలక్ష్మణులు ధనుర్ బాణములు చేతబట్టి ఏకశిలపై వెలిసిన పురాతన ఆలయం రామస్వామి గుట్ట వద్ద శ్రీరామనవమి పర్వదినాన్ని పునస్కరించుకొని శుక్రవారం శ్రీ సీతారాముల తిరు:కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది కళ్యాణ కర్తలుగా భీమనపల్లి విష్ణు, భోగ వెంకటేశం కమటం వెంకటయ్య, కమటం శంకర్ పుణ్య దంపతులు, కళ్యాణ కర్తలుగా పాల్గొనగా సన్నాయి మేళ తాళాలతో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి తిరు:కళ్యాణ మహోత్సవాన్ని గ్రామ పద్మ బ్రాహ్మణులు శ్రీ ఎర్రగుంట లక్ష్మీనారాయణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో రఘునాథపురంతో పాటు కమటం గూడం, సాదివెల్లి గౌరాయపల్లి, కాచారం, చిన్న గౌరాయపల్లి, ధర్మారెడ్డి గూడెం, నుండి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు కళ్యాణ అనంతరం తుంగ ఉప్పలయ్య కుటుంబ సభ్యులు మహా అన్నప్రసాద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ధన వస్తురూపమైన సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపురం తో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తుల రామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం అంతా భక్తి పరవశంతో రామనామ స్మరణతో మారుమోగింది, శ్రీ సీతారాముల తిరు కళ్యాణ మహోత్సవం కనులారా తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు తరించారు అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను స్వీకరించి ధన్యత పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రముఖులు వివిధ గ్రామాలనుంచి వచ్చేసిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలు




## వైభవ్ సూర్యవంశీ... టీమిండియాకు ఆడే అర్హత వచ్చేసింది!

భారత క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తున్న బీహార్ యువ కెరటం వైభవ్ సూర్యవంశీ తన కెరీర్‌లో కీలక మైలురాయిని చేరుకున్నాడు. శు క్రవారం (మార్చి 27) 15వ ఏట అడుగుపెట్టిన అతను, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల ప్రకారం భారత సీనియర్ జట్టుకు ఆడేందుకు అధికారికంగా అర్హత సాధించాడు. ఈ పరిణామంతో భారత క్రికెట్ భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.చిన్న వయసులోనే వైభవ్ తన అసాధారణ ప్రతిభతో క్రీడా పండితులను ఆశ్చర్యపరిచాడు. ఇటీవల ముగిసిన అండర్-19 ప్రపంచకప్‌లో కేవలం 14 ఏళ్ల వయసులోనే భారత్‌కు ప్రాతినిధ్యం వహించి అందరి దృష్టినీ ఆకర్షించాడు. అంతేకాకుండా, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత వేగంగా (కేవలం 35 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసిన భారత ఆటగాడిగా ఇప్పటికే రికార్డు సృష్టించాడు. అండర్-19 స్థాయిలో కూడా అతని పేరిట అనేక ప్రపంచ రికార్డులు ఉన్నాయి. ఈ గణాంకాలే అతని ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.యువ ఆటగాళ్ల శారీరక, మానసిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐసీసీ 2020లో కీలక నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, ఏ ఆటగాడైనా అంతర్జాతీయ మ్యాచ్‌లు (అండర్-19 ఈవెంట్లతో సహా) ఆడాలంటే కనీసం 15 ఏళ్ల వయసు నిండి ఉండాలి. చాలా అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే జాతీయ బోర్డు అభ్యర్థన మేరకు మినహాయింపు లభిస్తుంది. ఇప్పుడు వైభవ్ వయసు నిబంధనను సహజంగానే అధిగమించడంతో, ఇకపై సీనియర్ జట్టు ఎంపికకు ఎలాంటి అడ్డంకులు లేవు.ఇక రానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగనున్నాడు. ఈ యువ సంచలనంపై ఎలాంటి ఒత్తిడి పడకుండా జట్టు యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ విషయంపై రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ, "కెప్టెన్‌గా నా సలహా ఒక్కటే. అతను ఎక్కువగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు హాజరు కాకూడదు. మీడియాను ఎక్కువగా అనుసరించకూడదు" అని స్పష్టం చేశాడు. యశస్వి జైస్వాల్‌తో కలిసి వైభవ్ ఓపెనింగ్ చేసే అవకాశాలున్నాయని కూడా పరాగ్ సూచనప్రాయంగా తెలిపాడు.మొత్తం మీద, 15 ఏళ్లకే టీమిండియా అర్హత సాధించడం వైభవ్ సూర్యవంశీ అసాధారణ ప్రతిభకు నిదర్శనం. అతని భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా కనిపిస్తోంది. ఈ యువ బ్యాటింగ్ సంచలనం భారత సీనియర్ జట్టు జెర్సీని ఎప్పుడు ధరిస్తాడా అని దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ధోనీకి చెప్పడానికి మీరెవరు?

### విమర్శకులపై యోగరాజ్ సింగ్ ఫైర్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఒక్క రోజు ముందు, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలో టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగరాజ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధోనీకి ఇదే చివరి సీజన్ కావచ్చని ఊహాగానాలు వెల్లువెత్తుతున్న తరుణంలో, అతడి ఫిట్‌నెస్‌ను ప్రశంసిస్తూ మరో పదేళ్ల పాటు ఆడాలని సూచించారు.ఇన్‌సైడ్‌స్పోర్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగరాజ్ సింగ్ మాట్లాడుతూ విమర్శకులపై మండిపడ్డారు. "ధోనీ ఇంకా ఆడుతున్నాడు. రాబోయే 10 ఏళ్లు కూడా ఆడాలి. ఎందుకంటే అతను క్రమశిక్షణతో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. అతని చేతుల్లో బలం ఇప్పటికీ అద్భుతంగా ఉంది. ధోనీ ఒక గొప్ప వ్యక్తి. రిటైర్ అవ్వమని చెప్పడానికి మీరెవరు? క్రికెట్ పట్ల అతని నిబద్ధతకు హ్యాట్సాఫ్" అని అన్నారు. యోగరాజ్ వ్యాఖ్యలు ధోనీ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.అయితే, యోగరాజ్ అభిప్రాయంతో భారత మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ విభేదించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ, ఇదే ధోనీకి చివరి ఐపీఎల్ సీజన్ కావచ్చని అంచనా వేశాడు. "ఇది ధోనీ చివరి సీజన్‌గా అనిపిస్తోంది. చెన్నై జట్టులోకి సంజూ శాంసన్ వంటి వికెట్‌కీపర్‌ను తీసుకున్నారు. భవిష్యత్తులో ఫ్రాంచైజీకి ముఖచిత్రంగా శాంసన్‌ను తీర్చిదిద్దవచ్చు. ధోనీ స్వయంగా అతనికి బాధ్యతలు అప్పగించాలనుకోవచ్చు" అని పఠాన్ విశ్లేషించాడు.వయసు కారణంగా ధోనీ చివరి రెండు ఓవర్లలో మాత్రమే బ్యాటింగ్ చేస్తున్నాడని, ఆటగాడిగా మరిన్ని ఓవర్లు ఆడి బాధ్యత తీసుకోవాలని పఠాన్ సూచించాడు. కాగా, ఐదుసార్లు చెన్నైకి టైటిల్ అందించిన ధోనీ, తన భవిష్యత్తుపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.





# పెళ్లిపై నాకు మంచి అభిప్రాయం లేదు

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది.అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్నితత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు



# సోదరుణ్ణి కోల్పోయా.. ఆ గడ్డి మందును బ్యాన్ చేయండి

## నటుడు రాహుల్ రామకృష్ణ

ప్రముఖ సినీ నటుడు రాహుల్ రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక విజ్ఞప్తి చేశారు. అత్యంత ప్రమాదకరమైన 'పారాక్వాట్' అనే కలుపు (గడ్డి) మందును తక్షణమే నిషేధించాలని ఆయన కోరారు. మార్కెట్లో సులభంగా దొరుకుతున్న ఈ విష రసాయనం కారణంగా తాను తన సోదరుణ్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్యలకు సులభమైన మార్గంగా మారిందని, ఎందరో ప్రాణాలను బలిగొంటోందని చెబుతూ తెలంగాణ సీఎంవో, ప్రధానమంత్రి కార్యాలయాలను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.పారాక్వాట్ అనేది పొలాల్లో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు విరివిగా ఉపయోగించే ఒక రసాయనం. ముఖ్యంగా పత్తి వంటి మెట్ట పంటలు, వరి పొలాల గట్ల మీద పెరిగే గడ్డిని తొలగించడానికి దీనిని వాడతారు. తక్కువ ధరకే లభించడంతో దాదాపు ప్రతి రైతు ఇంట్లోనూ ఇది అందుబాటులో ఉంటోంది. అయితే, ఇదే అనేక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. క్షణికావేశంలో ఇంట్లో గొడవలు పడినవారు లేదా ఇతర సమస్యలతో బాధపడేవారు దీనిని తాగి ప్రాణాలు తీసుకుంటున్నారు.ఈ కలుపు మందు అత్యంత విషపూరితమైనది కావడంతో కొద్ది మోతాదులో తాగినా ప్రాణాలు కాపాడటం దాదాపు అసాధ్యమని వైద్యులు చెబుతున్నారు. ఆవేశం తగ్గాక బతకాలని వేడుకున్నా, వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని, శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వివరిస్తున్నారు. ఈ విషం చర్మంపై పడినా, వాసన పీల్చినా ప్రమాదకరమే.

**ఈ మందు తాగి తెలంగాణలో ఏటా 6 వేల మంది వరకు చనిపోతున్నారని అంచనా**

తెలంగాణలో పారాక్వాట్ తాగి ఏటా సుమారు 5,500 నుంచి 6,000 మంది చనిపోతున్నారని అంచనా. దేశవ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు 1000 కేసులు నమోదవుతున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, 'డాక్టర్స్ ఎగైనెస్ట్ పారాక్వాట్ పాయిజన్' వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. కనీసం మండల వ్యవసాయ అధికారి సిఫార్సుతో, ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి విక్రయించేలా నిబంధనలు కఠినతరం చేయాలని పలువురు సూచిస్తున్నారు.



# ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును మహిళలు ఇకనైనా ఆపాలి

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు.సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.